క్లుప్తంగా

పీఆర్ ఏఈగా సంతోష్



యాలాల: పంచాయతీరాజ్ శాఖ మండల ఏఈగా సంతోష్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జి ఏఈగా బాధ్యతలు నిర్వహించిన మధు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అనంతరం కొన్ని రోజుల పాటు బషీరాబాద్ మండల ఏఈ ఇన్‌చార్జిగా వంశీకృష్ణ వ్యవహరించారు. కాగా మంగళవారం నుంచి పీఆర్ ఏఈగా సంతోష్ బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తానని, మండల ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంటానని ఆయన చెప్పారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ నాయకులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని శివభక్త మార్కండేయ స్వామిని ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం పద్మశాలీల కులదైవం మార్కండేయుని జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మశాలీ సమాజం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు పురుషోత్తం రావు, శ్రీనివాస్, శోభారాణి, రామకృష్ణ, వెంకన్నగౌడ్, ప్రవీణ్ గౌడ్, రవిరాజ్ ఉన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మణ్ నాయక్

దోమ: గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నానని సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ అన్నారు. మంగళవారం గొట్లచెల్కతండాలో కలెక్టర్ నిధులు రూ.4 లక్షలతో సీసీరోడ్డు పనులు ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు భారీగా నిధులు కేటాయిస్తుందని తెలిపారు. ప్రతి వాడను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ఆ నిధులతో సీసీరోడ్లను వేయిస్తున్నామని చెప్పారు. గ్రామస్తులందరూ రోడ్లపై మురుగు నీరు, చెత్త, చెదారం వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

దోమ: గ్రామస్తులందరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సర్పంచ్ కోళ్ల సురేశ్ అన్నారు. మంగళవారం బొంపల్లిలో మైసమ్మ దేవాలయ మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు గ్రామస్తులకు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాఘపురం రాములు, ఉపసర్పంచ్ రఫిక్ పాష, గ్రామస్తులు నర్సింహారెడ్డి, అంతిరెడ్డి, చాకలి భాస్కర్, వెంకట్‌రెడ్డి, యాదయ్య, శ్రీనివాస్, గుడిసే రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు



ఎమ్మెల్యేతో నాయకులు

షాబాద్: పశువుల ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, సర్పంచ్ రాములుతో కలిసి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసిన అనంతరం నాయకులు మాట్లాడారు. మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో ఉన్న పశువైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇదే విషయం ఎమ్మెల్యేకు చెప్పగా.. స్పందించిన ఆయన పాత భవనం స్థానంలోనే కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. బొబ్బిలిగామ ఎంపీటీసీ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ పాండు, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఉపసర్పంచ్ శ్రీను, నాయకులు రాంచంద్రయ్య, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

రెండేళ్లయినా అతీగతి లేదు





నీరు లేక ఎండిపోతున్న వరినారు (ఇన్‌సెట్‌లో) రెండేళ్లుగా నిరుపయోగంగా ట్రాన్స్‌ఫార్మర్

- పోల్స్ ఇచ్చారు.. పాతడం మరిచారు
- తుప్పుపట్టిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్
- విద్యుత్ సరఫరా కోసం.. ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు

యాలాల: గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం సరిగా లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బాణాపూర్ శివారులో ఉన్న పొలాల బోర్లకు కరెంటు కోసం రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనప్పటికీ కనెక్షన్ లేకపోవడంతో వరినార్లు ఎండుముఖం పడుతున్నాయని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో అటు ట్రాన్స్‌కో, ఇటు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రెండేళ్లుగా సమస్యకు పరిష్కారం దొరకడం లేదు.

ఎండుతున్న నారుమళ్లు

బాణాపూర్‌కు చెందిన బంటు రాములు, పాండు, రెడ్యా నాయక్, బసప్ప, లోక్య నాయక్‌తో పాటు మరికొందరు రైతులు కలిసి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌కు డీడీలు కట్టగా.. రెండేళ్ల కిందట ట్రాన్స్‌ఫార్మర్, 18 విద్యుత్ స్తంభాలు మంజూరయ్యాయి. మంజూరైన విద్యుత్ స్తంభాలను కాంట్రాక్టర్ పాతకుండా అలాగే వదిలేశారు. దీంతో కొన్ని పోల్స్ దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై సర్పంచ్ భర్త రవి నాయక్ పలుమార్లు ట్రాన్స్‌కో ఏడీ, డీఈ, ఏఈలను కలిసి సమస్య వివరించినప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. విద్యుత్ స్తంభాలను కాంట్రాక్టర్ ఏర్పాటు చేస్తే.. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరా ఇస్తామని చెబుతున్నారని, అయితే కాంట్రాక్టర్ మాత్రం విద్యుత్ అధికారులు సరఫరా విషయంలో తనను ఇబ్బందులు పెడుతున్నారంటూ వాపోతున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. విద్యుత్‌సరఫరా లేకపోవడంతో వరి నారు ఎండు దశకు చేరిందని, అధికారులు స్పందించాలంటూ రైతులు కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు



రెండేళ్లుగా పొలాలకు కరెంటు కనెక్షన్ కోసం తిరగని అధికారి కార్యాలయం లేదు. ప్రతిసారి ఏదో ఒక కారణం చెప్పి మమ్మల్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఏటా వరి నారుమళ్ల విషయంలో పడరాని పాట్లు పడుతున్నాం. ఎమ్మెల్యే ఈ విషయంలో స్పందించి స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేలా చూడాలి.

– పాండు, రైతు బాణాపూర్

ప్రతి గ్రామంలో అభివృద్ధి చేశాం

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: గడిచిన నాలుగేళ్ల కాలంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని కోస్గి, మద్దూరు మండలాల్లో ఎమ్మెల్యే పర్యటించి, ప్రజలతో మాట్లాడి.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేసేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజల ఆదరించాలని కోరారు.

అభివృద్ధి పనులు..

కోస్గిలో లింగాయత్ శ్మశాన వాటికకు రూ.50 లక్షలు, పల్లెర్ల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణానికి రూ.22 లక్షలు, గ్రామపంచాయతీ భవనానికి రూ.20లక్షలు, సీసీరోడ్డుకు రూ.5లక్షలు మంజూరు చేయించారు. వాటికి ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కోస్గి మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష, గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, జెడ్పీటీసీ ప్రకాశ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సలీం, రాజేశ్, ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



పల్లెర్లలో ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- ఆత్మరక్షణకు కరాటే అవసరం
- ఎస్‌ఐ రవిగౌడ్



మాట్లాడుతున్న ఎస్‌ఐ రవిగౌడ్

కొడంగల్ రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, కరాటేలో శిక్షణ పొందడం వలన ఆరోగ్యంతోపాటు ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని ఎస్‌ఐ రవిగౌడ్, కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ అన్నారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రారంభించిన కరాటే శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాస్టర్ కరీమ్ ఆధ్వర్యంలో నెల రోజులపాటు 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థినులకు శిక్షణా తరగుతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్సై, కౌన్సిలర్ మాట్లాడారు. కరాటే నేర్చుకోవడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసంగా ఉంటారని, తద్వారా చదువులో చక్కగా రాణించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో హస్నాబాద్ సర్పంచు పకీరప్ప, పాఠశాల ప్రత్యేకాధారికి స్రవంతి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నీ

ధారూరు: మండల కేంద్రంలో ఈ 26 నుంచి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సద్దాం, చాంద్, నబీ, ఆఫ్రిది, వసీంలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొదటి విజేత జట్టుకు రూ.25 వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.15 వేలతో పాటు షీల్డ్‌లను అందజేయనున్నట్లు వారు వెల్లడించారు. ఆసక్తి గల క్రికెట్ జట్లు ఎంట్రీ ఫీజుగా రూ.వెయ్యి చెల్లించి, తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9182199183, 9959061969, 9398934554 నంబర్లను సంప్రదించాలని చెప్పారు.

శ్రీశైలం చేరుకున్న శివభక్తులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణం నుంచి శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయానికి పాదయాత్రగా బయలుదేరిన శివభక్తులు.. మంగళవారం చేరుకున్నారు. ఈనెల 17న బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి సాగర్‌గౌడ్ నేతృత్వంలో 150 మంది శివ మాలధారులు, శివభక్తులు పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. వారం రోజుల పాదయాత్ర అనంతరం మంగళవారం చేరుకున్నారు.

ధాన్యం బస్తాలతో మార్కెట్ కళకళ

మర్పల్లి: వ్యవసాయ మార్కెట్ మంగళవారం ధాన్యం బస్తాలతో కళకళలాడింది. ఈ ఏడు పంటలు విస్తృతంగా పండడంతో మునపటి కంటే ఇప్పుడు అధికంగా ధాన్యం బస్తాలు రావడంతో మార్కెట్లో సందడి నెలకొంది. మంగళవారం పలు గ్రామాల నుంచి మర్పల్లి మార్కెట్‌కు సుమారు వెయ్యి బస్తాల వరకు కందులు, ధాన్యం బస్తాలను రైతులు తీసుకురాగా.. మార్కెట్ కమీషన్ ఏజెంట్లు బీట్లు నిర్వహించారు. క్వింటాల్ మొదటి రకం కందులకు ధర రూ. 7,250 పలకగా.. రెండో రకం కందులకు రూ.6,900 పలికింది. క్వింటా వామ మెదటి రకం రూ.15,500 కాగా.. రెండో రకం రూ.13 వేలు పలికనట్లు ఏజెంట్లు తెలిపారు. క్వింటాల్ మొదటి రకం శనగలు రూ.4,650 ధర ఉండగా.. ద్వితీయ శ్రేణి శనగలకు రూ.4,500 పలికందని తెలిపారు.

బాలిక చదువు ఇంటికి వెలుగు



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ రమేష్ కుమార్

- ఆడపిల్లలను భారంగా భావించొద్దు
- తహసీల్దార్ రమేష్ కుమార్

కుల్కచర్ల: బాలికల చదువు ఒక కుటుంబాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తుందని తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికల విద్యతోనే వ్యవస్థ ఉన్నతిని సాధిస్తుందని, ఆడపిల్లల సంరక్షణను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. ఆడపిల్లలను బరువుగా భావించకుండా బాధ్యతగా చదివించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి బాలవరలక్ష్మి, మ్యాజిక్‌బస్ కోఆర్డినేటర్ నర్సింహులు, స్థానిక నేతలు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి



యాలాల: మార్కండేయ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ తదితరులు

యాలాల: మార్కండేయ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, ఎంపీటీసీ గరివప్ప, మాజీ సర్పంచ్ రవీందర్, కాగ్నా జలరైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ చాకలి శివప్ప, పోస్ట్ క్రిష్టయ్య ఉన్నారు.

పద్మశాలీల ఆధ్వర్యంలో..

పరిగి: పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కండేయ అభిషేకం పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరిపారు. అనంతరం సంఘం సభ్యులు పద్మశాలీల అభ్యున్నతిపై చర్చించారు. పద్మశాలీలందరు ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, శ్రీశైలం, రామస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



విద్యార్థులకు డ్రమ్‌సెట్ అందజేస్తున్న దాత వెంకట్‌రెడ్డి

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు దాతల అందించే సహకారం మరువలేనిదని గుండాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శివానందం అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చేవెళ్లకు చెందిన ఎల్ఐసీ సీనియర్ ఏజెంట్ కిచన్నగారి వెంకట్‌రెడ్డి మంగళవారం విద్యార్థుల పరేడ్‌కు ఉపయోగించే డ్రమ్స్‌సెట్‌ను అందజేసి మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ఇచ్చే ప్రతి సహకారం వారికి ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసుకునేందుకు కృషి చేయాలని చెప్పారు. మాట్లాడుతూ.. చదువు ఎంతో విలువైనదని, విద్యార్థులు నిర్లక్ష్యం చేయకుండా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్ యాదగిరి, గణేశ్, విద్యార్థులు ఉన్నారు.

'కంటి పాపను కాపాడుకుందాం'



కొడంగల్: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్మన్



కుల్కచర్ల: కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

కొడంగల్: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకొని కంటి పాపను కాపాడుకోవాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని కాలనీల్లో ఆయన పర్యటించి ఇంటింటి ప్రచారంలో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, కంటి పరీక్షలు చేసి మందులు ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ మధుయాదవ్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచు రమేష్ బాబు, గ్రామ సంఘం అధ్యక్షురాలు ఆనందమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్య ఉన్నవారిని గుర్తించాలి..

ప్రభుత్వ ఆస్పత్రిలో కంటివెలుగు శిబిరాన్ని ఈనెల 19న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. 19న 92 మంది, 20న 122 మంది, 21, 22 తేదిల్లో శనివారం, ఆదివారం కావడంతో సెలవు, 23న 79 మంది, 24న 114 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. మున్సిపల్ పరిధిలో 12 వార్డులు ఉన్నాయి. ఇంటింటికీ తిరిగి కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించి, శిబిరానికి తరలిస్తే ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అత్యుత్తమ కార్యక్రమం

కుల్కచర్ల: కంటివెలుగు పథకం అత్యుత్తమమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన కంటివెలుగు శిబిరాన్ని సందర్శించి కంటి పరీక్షలు చేయించుకొని మాట్లాడారు. అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని, ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నారాయణ, వైద్య సిబ్బంది వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు తప్పనిసరి

బంట్వారం: 18 ఏళ్లు పై బడిన వారంతా తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీఓ బాలయ్య సూచించారు. నాగవరంలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గ్రామాల వారీగా నిర్వహించే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు లక్ష్మి, క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ వందన, సూపర్ వైజర్ త్రివర్ణ, పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఎంపీహెచ్ఓ ఐలయ్య, ఆప్తమాలజిస్టు నవీన్, ఏఎన్ఎం అమృత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ, చైర్మన్ తదితరులు

షాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో 21 కల్యాణలక్ష్మి, 12 సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూర్ నర్సింగ్‌రావుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులుగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎంపీడీఓ అనురాధ, జిల్లా రైతు సంఘం సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేమంటే అంత చులకనా?

- గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల మండిపాటు



ఫారెస్టు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు

యాలాల: 'ప్రతి సర్వసభ్య సమావేశానికి కీలక శాఖల అధికారులు డుమ్మా కొడుతున్నారు. వారి తరపున దిగువస్థాయి సిబ్బందిని పంపుతూ.. మమ్మల్ని చిన్నచూపు చూస్తున్నారు. మేమంటే వారికి అంత చులకనా' అంటూ స్థానిక ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. మంగళవారం ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి విద్యుత్ శాఖ, ఆర్టీసీ, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, ఉపాధి హామీ, ఎంపీఓ లాంటి ముఖ్య అధికారులు గైర్హాజరయ్యారు. వారి తరపున దిగువ స్థాయి సిబ్బందిని పంపించారు. దీంతో అధికారుల తీరుపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదే అంశంపై అగ్గనూరు సర్పంచ్ భీమప్ప మాట్లాడుతూ.. ముఖ్య అధికారులు రాకపోతే సమస్యలు ఎవరికి చెప్పాలి? ఎలా పరిష్కారం అవుతాయంటూ వాపోయారు. ప్రతి సర్వసభ్య సమావేశంలో అధికారులు ఇలాగే ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

పెద్దలు వస్తే బాగుంటుంది

ముద్దాయిపేట సర్పంచ్ క్రిష్టయ్యగౌడ్ మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళలో గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని సభలో ప్రస్తావించగా.. మరుగుదొడ్ల నిర్మాణ బిల్లులు నేటికీ పూర్తి కాలేదని బెన్నూరు ఎంపీటీసీ లక్ష్మప్ప చెప్పారు. ఐసీడీఎస్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసేలా చూడాలని పలు గ్రామాల సర్పంచ్‌లు కోరారు. జీపీలలో కనీస నిధులు లేకపోవడంతో కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నామని దేవనూరు సర్పంచ్ శివకుమార్ ఆవేదన వ్యక్తం చేయగా.. సమావేశానికి పెద్దలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హాజరైతే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

అధికారి వర్సెస్ ప్రజాప్రతినిధులు

అటవీ శాఖపై సభలో చర్చ రాగా.. ఆ సెక్షన్ అధికారి ఖాజా మొయినొద్దిన్ మాట్లాడారు. పోడు భూముల విషయంలో విధులు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కొందరూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అటవీ భూములను దర్జాగా కొందరూ కబ్జాకు పాల్పడుతున్నారని, వారిని అడ్డుకునేందుకు తాము వెళితే.. నాయకుల సిఫారసు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని వాపోగా.. కోకట్ ఎంపీటీసీ కరణం పురుషోత్తంరావు, అచ్యుతాపూర్ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి అధికారి మాటలకు అభ్యంతరం తెలిపారు. అటవీ శాఖ అధికారి ప్రజాప్రతినిధులను నిందించడం మాని, విధులు సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. అనవసర వ్యాఖ్యలు చేయొద్దని హితవు పలికారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, తహసీల్దార్ గోవిందమ్మ, ఎంపీడీఓ పుష్పలీల ఉన్నారు.